భక్తిశ్రద్ధలతో చండీహోమం


కాశీవిశ్వేశ్వరస్వామి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రుద్రహోమం, చండీహోమం నిర్వహించారు. ఆలయంలో గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పారాయణాలు నిర్వహించారు.

పాపిరెడ్డినగర్‌లో కార్పొరేటర్ పర్యటన


పాపిరెడ్డినగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, రాంబాబు, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, లింగారెడ్డి, దానయ్య, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. మధురానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, ఖైరతాబాద్ ఇన్‌చార్జీ విజయారెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు.అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. నాయకులు అక్బర్, నర్సింగ్‌రావు, శశాంక్‌రావు, ముర్తజా,గోపాల్, సంగమేష్, కిరణ్, అమన్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత నిస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గురువారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎస్‌ఐఎస్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దనాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, క్రీడాకారులు, చిన్నారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: ఇంట్లో నిల్వ ఉంచిన 14 కిలోల గంజాయిని హైదరాబాద్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అస్సాంకు చెందిన జొమాటో డెలివరీ బాయ్ గోబిన బోయిన(27)మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధిఖీనగర్‌లో ఉంటున్నాడు. జూబ్లీహిల్స్ ఎన్‌డీపీఎస్ కేసులో పరారీలో ఉన్న బోయిన వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో ఇంటిని సోదా చేశారు. 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశాకు చెందిన డ్రగ్ పెడ్లర్ పిటారంజన్ నాయక్(30), జూబ్లీహిల్స్‌లో నివాసం ఉండే జార్కండ్‌కు చెందిన కుషాల్ సింగ్(26), ఇజ్జత్‌నగర్‌లో ఉండే దాబిన్ ఠాకూర్(28), ఆదిత్య సింగ్ చౌహాన్(26)లను అరెస్ట్ చేశారు. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు, వాడుతున్నట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సూచించారు.

వీధి వ్యాపారులతో కార్పొరేటర్ సమావేశం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో పీఎం స్వనిధి పథకం అమలులో భాగంగా అధికారులు గురువారం వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ పీఎం స్వనిధి చిన్నరుణాలు అందించే పథకం అని, ఈ పథకం ద్వారా వీధివ్యాపారులు తమ వ్యాపారాలను పునరుద్ధరించడానికి, విస్తరించడానికి 10 వేల వరకు రుణాలు పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఎలాంటి భద్రత లేకుండా రుణాలు లభిస్తాయన్నారు. ఈ రుణాలకు 7 శాతం వడ్డీ రేటు వర్తిస్తుందని తెలిపారు.

‘నిథమ్.. 100% ప్లేస్‌మెంట్

- పర్యాటక, ఆతిథ్యరంగాల్లో ప్రత్యేక కోర్సులు అందిస్తున్న విద్యా సంస్థ
- రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన విద్యా, శిక్షణ సంస్థ నిథమ్
- ఈ విద్యాసంవత్సరానికి ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ


రాయదుర్గం: పర్యాటక, అతిథ్య రంగాల కోర్సులను అందిస్తున్న ఏకైక జాతీయ ఉన్నత విద్యాసంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన ‘నిథమ్’ను 2004లో గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌లో 30 ఎకరాలలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, యూపీఏ మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ప్రారంభించారు. రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా విదేశీ విద్యార్థులకు కూడా అవకాశాలు కల్పించేందుకు సన్నాహాలు చేశారు. ప్రకృతిలో మియావాకీ ఫారెస్ట్, సోలార్ పవర్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పర్యావరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్న,100 శాతం ప్లేస్‌మెంట్లను అందించే సంస్థగా నిథమ్ గుర్తింపు సాధించింది. అంతేకాకుండా పర్యాటక, అతిథ్య రంగాలలో యువత, మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం పథకాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

- పర్యాటక ఆతిథ్య రంగాలకు చెందిన కంపెనీలు, హోటళ్లకు అవసరమైన నైపుణ్యం కలిగిన విద్యార్థులను నిథమ్ అందిస్తోంది.


గచ్చిబౌలిలోని నిథమ్ ప్రధాన ద్వారం

- నిష్ణాతులైన ఫ్యాకల్టీ, అత్యాధునిక సౌకర్యాలు, 4 ఎకరాల్లో విస్తరించిన చెరువు, రాక్‌గార్డెన్, మియవాకీ ఫారెస్ట్, గ్రీనరీ ఈ క్యాంపస్ ప్రత్యేకత
- నిథమ్‌లో ప్రాక్టికల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులలో నైపుణ్యాలను మెరుగుపర్చడం
- సాంకేతిక నైపుణ్యాల కంటే సమగ్ర అభివృద్ధి కలిగిన వృత్తుల తయారీపై దృష్టి సారిస్తుంది.
- పరిశ్రమ భాగస్వామ్యంతో కలిసి నిథమ్ కరికులమ్ నూతన ట్రెండ్స్, ఉత్తమ సాధన దిశగా అనుసంధానం చేయబడుతుంది.
- విద్య,శిక్షణను మెరుగుపర్చి నైపుణ్యాలు నేర్పించడమే, పరిశ్రమకు అనుసంధానమైన కరికులం
- పరిశ్రమల భాగస్వామ్యం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- అడ్మిషన్ల ప్రక్రియను కన్వీనర్ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.
- అడ్మిషన్లకు జూలై వరకు అవకాశం కల్పించారు. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయి.




నిథమ్ క్యాంపస్


నిథమ్‌లో తరగతి గది

నిథమ్‌లో అందించే కోర్సులు ఇవే..

- నిథమ్ అందించే కోర్సులలో బీబీఏ నాలుగేళ్ళ కాలపరిమితితో కూడిన టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ ఫుల్‌టైమ్ కోర్సు
- బీఎస్సీ మూడేళ్ళ కాలపరిమితితో కూడిన హాస్పిటాలిటీ, హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు
- ఎంబీఏ రెండేళ్ళ కాలపరిమితితో కూడిన టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ కోర్సులు
- మరిన్ని వివరాలు, కోర్సులు, అర్హత కోసం ఈ మెయిల్ admissions@nithm.ac.in, director@nithm.ac.in, వెబ్‌సైట్ www.nithm.ac.in ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్లు బీబీఏ: 9553700031, బీఎస్సీ: 9553700032, ఎంబీఏ: 9666065623లలో సంప్రదించాలి.

జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు



పర్యాటక, ఆతిథ్య రంగాలకు చెందిన సంస్థగా నిథమ్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ప్రతియేటా 100 శాతం ప్లేస్‌మెంట్స్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ, ఆహ్లాదకరమైన క్యాంపస్ ఉంది. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ గణేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్,నిథమ్

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది..



నిథమ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఆరంభమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ విదేశీ సంస్థలతో పరస్పర సహకారంతో ముందుకు సాగుతోంది. ఆధునిక లైబ్రరీ, క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా గుర్తింపు సాధించింది. చదువుతోపాటు క్రీడలకు సౌకర్యాలు ఉన్నాయి. జులై ఆఖరుకు అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–నిథమ్ అడ్మిషన్ల కన్వీనర్ డా.మహేశ్వర్‌రెడ్డి


ఆధునిక సౌకర్యాల వంట గది


గచ్చిబౌలిలోని నిథమ్‌లో క్రీడా ప్రాంగణం

ఎంసీఎస్-2024లో సత్తా చాటిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు తమ రాష్ట్రమైన మిజోరంలో ఉన్నతాధికారులుగా నియమితులయ్యారు. మిజోరం సివిల్ సర్వీసెస్ (ఎంసీఎస్–2024, కంబైన్డ్ కాంపిటీటివ్) పరీక్షలో ఇద్దరు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు సత్తా చాటారు. మిజోరం సివిల్ సర్వీసెస్ పరీక్షలో టాప్ ర్యాంక్‌ను పూర్వ విద్యార్థి శామ్యూల్ మల్సామ్ జువాలా హెచ్‌సీయూలో ఎంఏ ఎకనామిక్స్ చదివారు. అదేవిధంగా మరో పూర్వ విద్యార్థి జె లాలామ్‌పుయా పొలిటికల్‌సైన్స్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఏ చదివారు. వీరిద్దరూ మిజోరం సివిల్ సర్వీస్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ ఫ్యాకల్టీలు వారిని అభినందించారు.

‘ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ స్పేస్’ ప్రారంభం

చందానగర్ : చిన్న వ్యాపారుల అవసరాలను తీర్చే వాల్యూ ఫస్ట్ డిజైన్ నేతృత్వంలో వర్క్ స్పేస్‌లను అందించడంలో ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ నిబద్ధత కలిగి ఉందన్నారు. గురువారం నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ స్పేస్ నూతన కార్యాలయంను సహ వ్యవస్థాపకుడు యోగేష్ అరోరా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ట్ డాట్ ఎఫ్ కోవర్కింగ్ తమ విస్తరణ ప్రణాళికలో భాగంగా నూతన కేంద్రంను హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. ఇద్దరు నుంచి 30 మంది వరకు గ్రూప్‌లకో వర్కింగ్ స్పేస్ సీట్లను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్‌లో రానున్న రెండు సంవత్సరాలలో హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తామన్నారు.

సర్కిల్‌లో ఎర్లీబర్డ్ వసూళ్లు రూ. 124.89 కోట్లు

శేరిలింగంపల్లి: ఎర్లీబర్డ్ స్కీంలో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రాపర్టీట్యాక్స్ రూ.124.89 కోట్లు వసూలయ్యాయి. జీహెచ్ఎంసీ పరిధిలో రికార్డుస్థాయిలో వసూలయ్యాయి. ఎర్లీబర్డ్ స్కీంకు చివరి రోజైన బుధవారం ఒక్క రోజే రూ.13.05 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎర్లీ బర్డ్‌లో గత ఏడాది రూ.109.95 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

గచ్చిబౌలి స్టేడియంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

11 క్రీడల్లో శిక్షణ

గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. వివిధ క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ జూన్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. 8–18 ఏళ్ల విద్యార్థులకు అవకాశం ఉంటుందని గచ్చిబౌలి స్టేడియం ఏఓ కన్నం మధు తెలిపారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కరాటే, క్రికెట్, రెజ్లింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, యోగా, జుంబా, వెయిట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలలో నిపుణులైన కోచ్‌లు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఇప్పటికే 800 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, లింగంపల్లి, చందానగర్, రాయదుర్గం, నార్సింగి తదితర ప్రాంతాల వారు వేసవి శిక్షణ శిబిరం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఆసక్తి గల వారు https://satgasc.telangana.gov.in లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్‌క్యాంపు

మాదాపూర్: వేసవి సెలవుల సందర్భంగా శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను గురువారం ప్రారంభించారు. ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.పెన్సిల్ స్కెచ్, పాటరీ, మధుబని పెయింటింగ్, సీసెల్‌క్రాఫ్ట్, భగవద్గీత తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తరగతులుంటాయి. వివరాలకు ఫోన్. 8886652030, 8886652004లలో సంప్రదించగలరు.





చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

చందానగర్ : చికిత్స పొందుతూ పెయింటర్ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు....ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్ (26) తండ్రి ఘన్‌శ్యామ్‌ప్రసాద్ మెహిదీపట్నంలో నివాసముంటున్నారు. చందానగర్‌లోని ఓ నూతన భవనంలో బుధవారం పెయింటింగ్ పని ముగించుకొని చిప్పింగ్ మిషన్ తీస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. వెంటనే తోటి వర్కర్లు దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీంతో పెయింటర్ కుటుంబ సభ్యులు చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

‘మనూ’లో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పారామెడికల్, ఇతర కోర్సులలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేసినట్లు యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్ గురువారం వెల్లడించారు. అలైడ్ హెల్త్ సైన్సెస్‌లో ఈ సంవత్సరం నుంచి పీహెచ్‌డీ కోర్సును ప్రవేశ పెడుతున్నామన్నారు. మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ (ఎంఎల్‌టి అండ్ ఎంఐటీ) కోసం దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 4 ఆఖరు అని వెల్లడించారు. పీహెచ్‌డీ అలైడ్ హెల్త్ సైన్సెస్(ఎంఎల్‌టి)లో అడ్మిషన్ కోసం దరఖాస్తులను మే 13వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. ఉర్దూ నేపథ్యం ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23006612 ఎక్స్‌టెన్షన్ 1801లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్ చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికీ రూ. 1500 జరిమానా, నలుగురికి రూ.వెయ్యి జరిమానా, ముగ్గురికి రూ .2 వేలు, ఇద్దరికి రూ. 500, అదే విధంగా మరో వ్యక్తికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అధిక మోతాదులో మాత్రలు వేసుకుని యువతి ఆత్మహత్య

మియాపూర్: మానసికస్థితి సరిగా లేని యువతి అధిక మోతాదులో మందులు(టాబ్లెట్స్) వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న కె.విజయలక్ష్మీ బీడీఎల్‌లో ఉద్యోగం చేస్తుంది. వీరికి ఇద్దరు కూతుర్లున్నారు. రెండవ కూతురు వైశాలి(27) సంవత్సరం నుండి మానసికస్థితి సరిగ్గా లేక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉంది. రోజు మాదిరిగానే విజయలక్ష్మీ బుధవారం విధులకు వెళ్లి సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి రాగా డోర్ లాక్‌చేసి ఉంది. కూతురు వైశాలిని ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఆమె మరో తాళం చెవితో తలుపు తీసి లోపలికి వెళ్లిచూడగా బెడ్‌రూమ్‌లో వైశాలి అపస్మారకస్థితిలో పడి ఉంది. దీంతో తల్లి విజయలక్ష్మీ వైశాలిని దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. వైశాలి రోజు వేసుకునే టాబ్లెట్లను అధిక మోతాదులో వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. అమ్మా, అక్కా నన్ను క్షమించండి నా మానసిక పరిస్థితి బాగాలేక మీకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నా.. అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నానని సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తల్లి విజయలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన


గురునాథం చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, హైడ్రా అధికారులు

మియాపూర్: నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో గురునాథం చెరువు సుందరీకరణ పనులను హైడ్రా అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో 64 చెరువులున్నాయని, దశలవారీగా అన్ని చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. హైడ్రా డీఈ నాగరాజు, మోహన్, హైడ్రా టెక్నికల్ కన్సల్టెంట్ యూనిస్, నాయకులు మోహన్ ముదిరాజ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ సభ్యులు తదితరులున్నారు.

ఘనంగా మే డే

గచ్చిబౌలి: మే డేను గురువారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల జెండావిష్కరణలు చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి నర్సింహ, నాయకులు ఎల్లేష్, కిరణ్, అనిల్, రాజేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, శివ, నిర్మల, తిమ్మక్క పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు డా.యాదయ్య కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు డాక్టర తిప్పర్తియాదయ్య పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ముందు మేడే ఉత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. అనంతరం కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశప్ప, గురుచరణ్, నాగరాజు,మహేష్, ఆగమయ్య, ఉప్పలయ్య, మల్లయ్య, వెంకన్న డేవిడ్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం పోరాడేది ఎర్రజెండానే

కార్మికుల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సీఐటీయూ నాయకుడు సాంబశివరావు పేర్కొన్నారు. గచ్చిబౌలి కూడలిలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయడమే లక్ష్యంగా వామపక్షాలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కొంగరకృష్ణ, అనిల్, రవీందర్, విజయ్‌కుమార్, ఎస్‌వికే సిబ్బంది పాల్గొన్నారు.


గచ్చిబౌలి కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ


గచ్చిబౌలిలో జీహెచ్ఎంసీ కార్మికులను సన్మానించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

మదీనాగూడలో..

గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో మదీనాగూడలో మేడే నిర్వహించారు. తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల పాండురంగారావు, తెలంగాణ సినిమా రచయితల సంఘం అధ్యక్షుడు పులి అమృత్, జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు శోభన్, కృష్ణ ,నాయకులు బాజీ పాల్గొన్నారు.

మహాప్రస్థానం సిబ్బందికి సన్మానం

రాయదుర్గం: వైకుంఠ మహాప్రస్థానం సిబ్బంది సేవలు మరువలేమని బీఆర్ఎస్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు. వైకుంఠ మహాప్రస్థానం ఏర్పాటు చేసి పదేళ్లయిన సందర్భంగా, అలాగే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మహా ప్రస్థానం మేనేజర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందిని సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు నరేష్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాయదుర్గం వైకుంఠ మహాప్రస్థానం సిబ్బందిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకుడు సాయిబాబా తదితరులు


శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కార్యాలయం వద్ద..


మదీనాగూడలో..